# జాగారం

"ధడ్...ధడ...ధడ్‌డ్..ధడా...ధడ్...యిస్స్...స్స్" వాకిట్లో బండేదో ఆగిన శబ్దమై చప్పున మగతనిద్రలో నుండి మెలకు వొచ్చింది వసంతలక్ష్మికి... కనురెప్పలు బిరుసుగా, కనుగుడ్లు ఎర్రగా అయి విపరీతమైన మంట పెడుతున్నాయి. నిద్రొస్తుం టుంది... కన్నుమూస్తే అయనొచ్చేస్తాడేమోనని గబుక్కున తెలివొచ్చేస్తుంది. ఇది ప్రతిరోజూ జరిగేదే. బండి శబ్దం వినగానే, దుప్పటి తొలగించి దూకినట్లుగా మంచందిగి తలుపు వద్దకి పరిగెత్తింది వసంతలక్ష్మి. ముందూ వెనుకా చూడకుండా తలుపు తెరిచేసిందిగానీ నిజానికి బయటెవరూ లేరు. మోటర్‌సైకిలెవర్దో ఆగినట్లు ఆగి వెళ్ళిపోయినట్లుంది. అంతటా నిశ్శబ్దం నిండిన చీకటి. ఎక్కడో దూరంగా అక్కడక్కడా వీధిదీపాలు వెలుగుతున్నాయి మినుకు మినుకుమంటూ. ఆరిపోతున్న ఆశల్ని వెలిగించడానికి ప్రయత్నించే చిరు ధైర్యంలా.

చాలా సేపట్నుండీ కురిసి వెలిసిన వాన మట్టివాసనల్ని మోసుకొస్తోంది. తేమని నింపుకున్న చలిగాలి రివ్వుమంటూ వసంతలక్ష్మి మొహాన్ని తాకి దూసుకుపోయింది. 'పూలయ్యావు సుమా ' అంటూ గాలి వెక్కిరించి వెళ్ళినట్లుగా అన్పించిందామెకు. గబుక్కున తలుపు మూసి గడియపెట్టి అదే తలుపుకి వీపానించి దీర్ఘ నిశ్వాసమొకటి వొదిలింది. హాల్లో పరుచుకున్న ఆకుపచ్చరంగు దీపపు కాంతిలో, కోకిల కంఠపు గడియారంలోని రెండు ముళ్ళూ పన్నెండు దగ్గర కౌగిలించుకుని పడుకున్నాయి. చిన్నముల్లుని వదల్డానికిష్టం లేనిదానిలా పెద్దముల్లు కదలడం మానేసినట్లుంది. వాటివంక తదేకంగా చూస్తూంటే అసూయేసింది వసంతలక్ష్మికి. అవే నయం... ప్చ్... నాజూకయిన తన శరీరాన్ని, సున్నితమైన ఆత్మనీ కౌగిలించుకోవడానికిక్కడెవరూ లేరు... ఆమాటకొస్తే ఈ ప్రపంచంలో ఎవరికీ ఎవరూ వుండరు... ఎవరో వున్నారు, ఎవరో వస్తారు అనే భ్రమలో బతికేస్తుంటాం... ఆ భ్రమే జీవితాన్ని నడిపిస్తుంటుంది. నీటి ప్రవాహం మీది కొయ్యముక్కల్లా ప్రయాణం సాగుతుంటుంది .

"అబ్బాయింకా రాలేదమ్మా?" బాత్‌రూమ్‌కి కాబోలు లేచిన మామగారు ప్రశ్నించారు వసంత తలుపుకానుకుని నిల్చునుండడం చూసి.

"లేదు మామయ్యా వచ్చినట్లన్పిస్తేనూ" నవ్వడానికి ప్రయత్నించింది. ఉదయం లేచిం దగ్గర్నుండీ యిలాంటి ముసుగులు అప్రయత్నంగానే తొడుక్కుంటూ వుంటుంది వసంతలక్ష్మి.

"ఏవిటమ్మా యిది? ఎప్పుడొస్తాడో తెలీనివాడికోసం తిండీతిప్పలూ లేకుండా ఎదురు చూస్తావు... బయటికెళ్ళిన వాళ్ళు సవాలక్షసార్లు కాఫీలు, టీలు తాగుతుంటారు. వాడొచ్చిందాకా నువ్విట్లా పస్తుండడం ఏం బాగాలేదమ్మా..." కోడల్ని మందలించి 'మరీ పద్ధతి లేకుండా పోతున్నాడు ' గొణుక్కుంటూ బాత్‌రూమ్ వైపుగా సాగిపోయాడాయన.

మామగారి మాటల్ని పెద్దగా పట్టించుకోనిదానిలా గదిలోకొచ్చి మంచంమీద కూర్చుంది వసంతలక్ష్మి నిటారుగా... నిద్రలో వున్న బాబిగాడు కదిలి ఒక్కసారి తల్లికేసి చూసి, తిరిగి కళ్ళు మూసుకున్నాడు. చల్లనిగాలి గదంతా పరచుకోవడంతో, లేచి వెళ్ళి కిటికీరెక్కలు మూసి కర్టెన్లు సరిచేసింది. కిటికీలు వేసేస్తే అతడొస్తే విన్పించదేమో! విన్పించకపోవడానికి తనకసలు నిద్రపడితేగా? అనుకుంటూ బాబిగాడికి దుప్పటి సరిచేసింది. వాడికి వూరికే జలుబు చేసేస్తుంది. ఈ చల్లగాలికి వాడి ఊపిరితిత్తుల్లో నెమ్ము చేర్తే యింకేమయినా వుందా? నిద్రపోతున్న బాబిగాడి వీపుమీద ప్రేమగా జోకొట్టి వాడ్ని మరింత నిద్రలోకి నెట్టింది.

చిన్న లైటార్పి గదిలో ట్యూబ్‌లైటేసుకుని పాత పత్రికని తెరిచింది. అక్షరాల వెంట కళ్ళు పరిగెడ్తున్నాయే గాని, భావమేదీ మెదడులోకి ఎక్కడంలేదు. విసుగ్గా పత్రికని పక్కన పడేసింది .

'ఏమైందీయనకి?... ఛ...ఛ రోజూ యింతే... జీవితమంతా యిలానే ఎదురుచూస్తూ గడిపేయాలేమో... ఎదురుచూపుల్లోని తియ్యదనాన్ని ఏ కవి వర్ణించాడో, తనముందుగ్గాని

వస్తే చెంపలు వాయిగొడ్తుంది. 'తీపంట తీపి, పులుపు కాదూ' తనలో తనే విసుగ్గా నవ్వుకుంది వసంతలక్ష్మి. చిన్నప్పుడు తన క్లాస్‌రూమ్‌లో డ్రాయింగ్ మాస్టారు గీసిన 'నిరీక్షణ' అన్న చిత్ర ముండేది. క్లాసులో పాఠం జరిగినంతసేపూ తనా బొమ్మనే చూస్తూండేది. అంత అద్భుతంగా వుండేదా బొమ్మ. దాన్ని చూసిచూసి తన మనసులో ముద్రించుకుపోయి చివరికి తన జీవితమే నిరీక్షణామయమైపోయింది. ఇప్పుడుగానయితే ఆ బొమ్మని ముక్కలుముక్కలు చేసుం డేదేమో... నిరీక్షణంట... నిరీక్షణ... ఛ్ఛ .... బెడ్ మీద పడేసిన పాత పుస్తకాన్ని మళ్ళీ చేతిలోకి తీసుకుంది .

'ఏమిటలా తడిసి ముద్దయ్యావు?' ప్రశ్నించిందామె భర్తని .

'ఈ రాత్రి చంద్రుడు వెన్నెలని కొలనులో ఆరబెట్టుకున్నాడు... నీకోసం రెండు వెన్నెల ముక్కల్ని ఏరుకొద్దామని కొలనులో దిగాను' చెప్పాడతడు.

'షిట్ '... పుస్తకాన్ని విసిరికొట్టింది వసంతలక్ష్మి. ఎందుకిట్టాటి అభూతకల్పనలు వ్రాసి పాఠకుల్ని మభ్యపెడతారీ రచయితలు. ఎక్కడయినా మొగుడు పెళ్ళాంకోసం వెన్నెల ముక్కల్ని ఏరుకొస్తాడా?.... తెస్తేగిస్తే ప్రియురాలి కోసమేమయినా తెస్తాడేమో... అదీ అందేదాకే...

వంటగదిలో నుంచి పిల్లి గిన్నె తోసిన చప్పుడుతో లేచి అటు పరిగెత్తింది వసంతలక్ష్మి. పాలు వొలికిపోయి వున్నాయి. చకచకా అవన్నీ తీసి, తుడిచి మిగిలిన పాలల్లో తోడుపెట్టి, బియ్యపు డబ్బాలో పెట్టింది.

ఇంకా నయ్యం... తను మేలుకుంది కాబట్టి సరిపోయింది... లేదంటే ఉదయాన్నే అత్తగారు క్లాస్ తీసుకునేది... ఆవిడెప్పుడూ 'యిదేంటి యిట్లా చేశావు?' అంటూ నేరుగా అడగదు.

'నేనొచ్చేటప్పటికి పిల్లి పాలు దొర్లించి వంటిల్లంతా పాడుచేసి వుంటే మొత్తం తుడిచా నమ్మా... అదిగో ఆ గిన్నెలు తీసి అంట్లల్లో పడేసి 'స్టౌ' తుడిచి పాలు కాశాను... పాలబ్బాయొచ్చి బెల్ కొడితే అటుపోయి చూద్దునుగా తలుపు తీసేవుంది... ఇంకెందుకని తలుపేసి వచ్చాను... ఇప్పుడు... అయిదుగంటలప్పుడు' అంటుంది నొక్కినొక్కి. తనకి ఈడ్చి చెంపమీద కొట్టినట్టన్పి స్తుందా వ్యంగ్యం. అంతకన్నా 'రాత్రి పాలల్లో చేవిరి పెట్టలేదా వసంతా? తలుపు వేయడం మర్చిపోయినట్టున్నావు?' అంటూ డైరెక్టుగా అడిగితే బావుణ్ణన్పిస్తుంది తనకి.

బయట కారాగిన చప్పుడయి మళ్ళీ హాల్లోకి పరిగెత్తింది వసంతలక్ష్మి. అప్పుడప్పుడూ అతడి పేకాట మేట్లూ యిట్లా కార్లో తీసుకుచ్చి డ్రాప్ చేయడం అలవాటే. తలుపు తెరవబోయి మానుకుని పక్కనేవున్న కిటికీ తీసి చూసింది.

పైవాళ్ళు మెట్లు దిగుతున్నారు. వాళ్ళమ్మాయిని కాబోలు ఒంటిగంట మెయిలు ఎక్కించడానికి వెళ్తున్నారు... 'ఛ్ఛ ఛీ' అంటూ విసుగ్గా వచ్చి మళ్ళీ పడగ్గదిలో కూర్చుంది.

గూడూర్లో వున్నప్పుడే నయం... తనొక్కర్తీ వుంటుందని కొంత కన్సిడరేషన్తో పదకొండింటికే వచ్చేవాడు... ఇప్పుడా సానుభూతి కూడ కోల్పోయింది. పట్టుబట్టి ట్రాన్స్ఫర్ చేయించుకుని జిల్లా కేంద్రమని యిక్కడ తెచ్చి ఉమ్మడి కుటుంబంలో పడేశాడు. అరవచాకిరీతో నిండిన పగళ్ళు, నిద్రపోవడానికి వీల్లేని సుదీర్ఘరాత్రులూ... ఛి... ఛీ... సుఖమనేది లేకుండా పోయింది... ప్చ్...

బావగారు చాలా పద్ధతయిన మనిషి... నాలిగింటికి లేచి యోగా చేస్తాడు. ఆ తర్వాత ఆ రోజుటి పేపర్లు చూసి, భార్య చేతి కాఫీ తాగి తల్లితోనూ, తండ్రితోనూ ఒక అరగంట కబుర్లు చెప్తాడు. వారి ఆరోగ్యాన్ని గురించీ, వారిక్కావల్సిన మందులూ, పండ్లు అన్నీ ఎంక్వయిరీ చేసి కనుక్కుంటాడు. ఆతర్వాత స్నానంచేసి కుటుంబసభ్యులందరితో కలిసి టిఫిన్ తిని కంప్యూటర్ సెంటర్ కెళ్తాడు. అదివరకు అతడేదో గవర్మెంటాఫీసులో కంప్యూటర్ అసిస్టెంట్గా పనిచేసేవాడు. ఈ మధ్యనే ఉద్యోగాన్ని వదిలేసి ఇంటర్నెట్ పెట్టాడు. జిల్లాలో అతడిదే మొదటి ఇంటర్నెట్ కావడంతో బాగానే జరుగుతోందంటున్నారు. బాబీగాడికీ, బావగారి ఒకే ఒక కొడుకు అభిషేక్కీ అతడు ఇంట్లోనే కంప్యూటర్ నేర్పుతున్నాడు. సాయంత్రం ఎంత ఆలస్యమయినా ఎనిమిదీ ఎనిమిదిన్నరకల్లా యింటికి చేరుకుంటాడు.

గంటసేపు పిల్లల చదువు విషయం చూసి ఆతర్వాత భోజనం చేసి భార్యతో కలిసి గదిలో కెళ్ళిపోతాడు. అంత పెందలాడే లోపలికెళ్ళి ఏంచేస్తారు వాళ్ళిద్దరూ. భార్యాభర్తలిద్దరూ గదిలో కెళ్ళి ఏంచేస్తారు... తనేనాడయినా అంత పెందలాడే పడుకుందా భర్తతో కలిసి... ఎప్పుడూ అర్ధరాత్రి దాటాక రోజు మారిపోయాక అతడొస్తాడు. అప్పటిదాకా కలతనిద్రతో వేగిపోయిన శరీరం విశ్రాంతిని కోరుతుంది. తనకా ఆసక్తి వుండదు. యింటికొచ్చాక అతడికి 'ఆ శక్తి' వుండదు.

ఆలోచనల్లోనే నిద్రలోకి జారుకుంది వసంతలక్ష్మి.

నిద్రలోనే ఒక విధమైన మత్తులో, అతడు ప్రేమగా తనని దగ్గరకి తీసుకుంటున్నాడు... అతడి చేతులు తన శరీరం మీది సున్నిత భాగాలను ఆర్తిగా స్పృశిస్తున్నాయి... గిలిగింతలూ, పులకరింతలూ, కలవరింతలూ... వెరశి ఆర్గాజమ్... ఆ అద్భుతమైన ఆనందాన్ని చీల్చుకుంటూ మళ్ళీ దఢ్... దఢ్... ఢడామంటూ కాలింగ్బెల్ చప్పుడు... చటుక్కున లేచి కూర్చుని పరిగెత్తబోయి ఆగిపోయిందామె. ఈ బండి శబ్దమూ, కాలింగ్ బెల్ మోత ఇవన్నీ నిజానికి బయటినుంచి విన్పించడం లేదని, మాటిమాటికీ తన గుండె చేస్తోన్న శబ్దాలేననీ అర్ధమయింది వసంతలక్ష్మికి.

అప్పటిదాకా కనురెప్పల మీద విరబూసిన స్వప్నపుష్పాల్ని చేతుల్లోకి తీసుకుని, తడుముతూ ఆలోచనలో పడిందామె. ఆతర్వాత ఎంతసేపటికీ నిద్రపట్టలేదు. మెల్లిగా లేచి

వెళ్ళి చిన్న సౌండ్‌తో టి.వి.ఆన్ చేసింది... బజ్... బర్రుమన్న శబ్దంతో అందమైన హీరో, హీరోయిన్లు తెరమీదికొచ్చేశారు గంతులేస్తూ....

'మాయదారి మాయదారి అందమా

ఉయ్యాలాటకిక సిద్ధమా....'

ఒళ్ళు భగ్గుమంది వసంతలక్ష్మికి. ఉయ్యాలాటంటా ఉయ్యాలాట విసుక్కుంటూ ఛానల్ మార్చింది .

'ప్రతి రాత్రీ వసంతరాత్రీ ... ప్రతిగాలి పైర గాలి

బ్రతుకంతా ప్రతి నిముషం పాటలాగ సాగాలి......'

'పాటలాగ సాగుతుందా బతుకెక్కడయినా... త్పూనీయవ్వ' అంటూ కసిగా టి.వి ఆఫ్ చేసింది.. ఛ...ఛ... ఏమిటి తన నోట్లోనుండి యిట్లాంటి మాటలొస్తున్నాయి...

పెళ్ళికాక ముందు వసంతలక్ష్మి ఎలా వుండేది? వసంతఋతువులాగే కదా... ఉదయపు అందాలనూ, సాయంసంధ్యలోని పసుపు పచ్చదనాన్ని, పచ్చనిచెట్లలోని హరితవర్ణాన్నీ, ఏటి ఒడ్డున మర్రిచెట్టుకింద కూచున్నప్పటి హాయి గురించీ, అమ్మ గురించీ తెరలు తెరలుగా జ్ఞాపకం చేసుకుంది వసంతలక్ష్మి. పెళ్ళికాక ముందు యివన్నీ ఆమె ప్రాణశక్తులు. పెళ్ళయిన మర్నాటినుంచీ చిత్రంగా మారిపోయింది వసంతలక్ష్మి. ఆయన యిష్టాలు, రుచులూ, అభిరుచులూ, అతడి కోసమే, అతడితోడిదే జీవితం, అతడు వేరు, తను వేరూ కాదు అనే ఒక అలౌకిక ప్రేమలో పడిపోయింది వసంతలక్ష్మి. సాహిత్యాన్నీ, సంగీతాన్నీ, సారవంతమైన ఆలోచనలనూ అన్నింటినీ వరుసగా తనకే తెలీని క్రమంలో మరిచిపోయింది. అతడి సంరక్షణా భారాన్నంతా గుత్తకు తీసుకున్నదానిలా బతకడం మొదలుపెట్టింది.

ఇంట్లోని ప్రతికూల పరిస్థితుల్లో తన అస్థిత్వాన్ని నిలబెట్టుకోవడం కోసం ఆ హడావిడిలో తనలోని సౌకుమార్యాన్ని, మార్దవాన్నీ, స్పందననీ క్రమంగా వదిలేసింది.

పెళ్ళి... పెళ్ళి... ఆడపిల్ల పెళ్ళికోసమే పుడుతుందా?... పెళ్ళి లేకపోతే జీవితమే లేదా?

పుట్టినప్పట్నుండీ ఆ పిల్లకి పెళ్ళిచేయాలనే ధ్యాస తప్ప మరో ఆలోచన , అభిప్రాయం వుండవు ...జీవితం కంటే పెళ్ళే ముఖ్యమన్నట్లుగా పెంచబడ్తుంది... వసంతలక్ష్మి వాళ్ళమ్మ కూడ యిందుకు భిన్నమేమీ కాదు. అమ్మాయిని ఏదో ఒక అయ్య చేతిలో పెట్టేస్తే నిశ్చింత అనుకుంది. కూతుర్ని యిష్టప్రకారం చదివినంత వరకూ చదివించుదాం, ఆమెకి నచ్చిన మార్గంలో వెళ్ళే స్వేచ్ఛనిద్దాం అనుకోలేదు. అందుకే వసంతలక్ష్మి డిగ్రీలో చేరాలన్న కోరిక కోరికగానే వుండిపోయింది. ఇంటర్మీడియెట్లో వచ్చిన డిస్టింక్షన్ మార్కులు పసుప్పచ్చ బూజు పట్టి వూరుకున్నాయి.

ఇప్పుడా చదువు చాకలిపద్దు వ్రాసుకోడానికీ, పాత పత్రికలు తిరగేయడానికి పని కొస్తుంది. ఆ పత్రికలయినా మంచివి చదువుదామని రాజేశ్వరినడిగితే 'వనితా మార్గం' 'భూమిక' 'స్త్రీశక్తి' పుస్తకాలు పంపించింది. ఆ పత్రికలు చూసి యింట్లో పెద్ద గొడవే జరిగింది. అటువంటి పుస్తకాలింకోసారి చూస్తే యింట్లోనుండి బయటికి గెంటేస్తానన్నాడతడు. అర్థంకాక విస్తుపోయి చూస్తుంటే 'వనితామార్గం' 'భువనతార' పత్రికలు యింట్లో వుంటే పోలీసులు అరెస్ట్ చేస్తా రన్నాడు. మంచి పత్రికలు చదివి జ్ఞానం పెంచుకుంటే పోలీసులెందుకు అరెస్ట్ చేస్తారో అర్థం కాలేదామెకి. ఆ విధంగా చైతన్యం అనేది యింట్లోకి రాకుండానే గడపలో నుండే వెళ్ళిపోయింది వసంతలక్ష్మికి.

పది వసంతాలు గడిచిపోయాక యిప్పుడాగి చూసుకుంటే జీవితం ఉన్నచోటే ఉన్న దున్నట్టుగా వుందన్న సంగతి అర్ధమై దుఃఖం తన్నుకొచ్చింది .

'డింగ్ డాంగ్.. డింగ్‌డాంగ్ ' అంటూ పెద్దమోతతో గుండెలమీద రెండు బాదులు బాదింది గడియారం. ఉలిక్కిపడింది వసంతలక్ష్మి.

"ఏమైందీయనకి?... ఇవ్వాళ మరీ లేటయినట్లుంది... డ్రింక్ మీదే బండి నడుపుతారు. ఎక్కడయినా ఏదయినా ప్రమాదమేమీ జరగలేదు కదా. అటువంటిదేదయినా జరిగి ఆయన కేమయినా అయితే తన పరిస్థితేమిటి? ఎలా జీవిస్తుంది? ఇటు చదువూ లేదు... అటు చేతి వృత్తులూ రాక తనెలా నిలదొక్కుకుంటుంది? ఆయన తరపున ఆస్థిపాస్తులు కూడా ఏమీ లేవు. మామగారు తన జీవితమంతా శ్రమించి ఈ యిల్లు మాత్రం నిలబెట్టారు. కొడుకు లిద్దర్నీ చదివించి ఉద్యోగస్తుల్ని చేశారు. ఆడబిడ్డకు శక్తికి మించి పెళ్ళిచేసి పంపించాడు.

ఆలోచిస్తోంది వసంతలక్ష్మి... భర్తకేదయినా అయితే తనెలా బతుకుతుంది? బొట్టూ కాటుక పెట్టుకుంటుందా? మంచి చీరలు కట్టుకోదా?... వివాహాది శుభకార్యాలకు వెళ్ళదా?

అందుగురించేనా తనకి బాధ?... అంతకుమించి అతడితో తనకింకేమీ బంధం లేదా?

'ఉంది... ఉంది' పెద్దగా అరిచింది వసంతలక్ష్మి. అతడు తనకి కావాలి. అతడంటే తనకి చాలా యిష్టం. అతడు లేకపోతే తను జీవించలేదు. ఎందుకో ఏడుపొచ్చింది వసంతలక్ష్మికి.

గడియారం మళ్ళీ మరోసారి అరిచింది అరగంట గడిచిపోయినట్లుగా.

ఛీ....ఛీ... ప్రతిరోజూ అతడు బయటికెళ్ళింది మొదలూ, యింటికి తిరిగొచ్చేదాకా యివే ఆలోచనలు. అతడికెక్కడో ప్రమాదం జరిగినట్లు, దెబ్బలు తగిలినట్లూ, లేదా అసలు మరణమే సంభవించినట్లు... ఏదేదో మథన... ఇటువంటి నెగటివ్ థాట్స్ వుండకూడదని భగవాన్ ప్రీచింగ్స్‌లో చెప్తారు కదా... ఈ మధ్యనే అత్తగారితో కలిసి ఒక బాబాగారి ప్రీచింగ్స్‌కి వెళ్ళింది వసంతలక్ష్మి. కాసేపు మనసు గట్టి చేసుకుని మెదడులోకి ఎటువంటి నెగటివ్ థాట్స్ రాకుండా ఉగ్గబట్టుకుంది. అయిదు సెకండ్లు గడిచాక మళ్ళీ అంతా మామూలే.

ఈరోజు సాయంత్రం ప్రక్కవీధి సెంటర్లో పాత పెద్దాసుపత్రి ఎదురుగా కమ్యూనిస్టు లీడరు మాలకొండయ్య హత్య జరిగింది. నడిరోడ్డు మీద అతడిని నరికి పారేశారట. వూరంతా అట్టుడికినట్లు వుడికిపోతోంది. అక్కడెక్కడయినా యిరుక్కుపోయాడా భర్త అని ఆలోచించింది.

పోలీసులేమయినా అరెస్టు చేయలేదు కదా... ఛ...ఛ... పోలీసులు పేకాడితేనూ, తాగి డ్రైవింగ్ చేస్తేనూ, పెళ్ళాన్ని వెయిటింగ్‌లో పెడితేనూ అరెస్ట్ చేయరు. అటువంటి చట్టాలేమీ లేవు. కానీ 'భువన తార' చదివితే మాత్రం పట్టుకుంటారు.

మెయిన్‌రోడ్డు మీది నుండి ఒక లారీ భయంకరమైన శబ్దం చేస్తూ దూసుకుపోయింది. దాని తాలూకూ శబ్దం చాలాసేపటివరకూ వసంతలక్ష్మి గుండెను వొణికిస్తూనే వుంది.

బావగార్ని, మామగార్ని నిద్రలేపి ఆయనింకా రాలేదని చెప్దామా అనుకుంది ఒక్కక్షణం. ప్రతిరోజూ చచ్చేవాళ్ళకి ఏడ్చేవాళ్ళెవరుంటారు? అయినా యింత రాత్రివేళ వాళ్ళని లేపి కంగారు పెట్టడమెందుకులెమ్మని సరిపెట్టుకుంది. తోడికోడలు తనవంక చూసే జాలిచూపుల్ని భరించడం చాలా కష్టంగా వుంటుంది వసంతలక్ష్మికి.

మెల్లిమెల్లిగా టిక్కు టిక్కుమని శబ్దం చేస్తూ నిమిషాల్ని గంటలుగా మారుస్తోంది గడియారం. కళ్ళుమూతలు పడుతున్నాయి. మళ్ళీ వాటంతటవే తెరుచుకుంటున్నాయి అప్రయత్నంగా. నిద్రో, కాదో తెలీని స్థితి. వసంతలక్ష్మికి చెప్పలేనంత విసుగూ, కోపమూ వచ్చాయి భర్తమీద. వచ్చాక గట్టిగా పోట్లాడాలని నిర్ణయించుకుంది.

'రానంత సేపూ విరహమా... నేను రాగానే కలహమా?' అతడు దగ్గరకి తీసుకుని అడుగుతున్నాడు తనని. ఒక్కసారిగా సిగ్గూ, సంతోషమూ ముప్పిరిగొన్నాయి వసంతలక్ష్మిని. ఆనందపు అంచులకు చేరుకోబోతూ... బాబిగాడు నడుంమీద కాలేయడంతో ఒక్కసారిగా తెలివిలోకొచ్చింది .

హయ్యోరామ... అంతదృష్టం కూడానా? అతడొచ్చాక యిదేమిటి యింతాలస్యమైంది అంటూ ప్రశ్నించే చనువు తనకుందా?

నీకా హక్కులేదు. నేను బయట పనిచేసి సంపాదించి తెస్తున్నాను. నిన్ను పోషిస్తున్నాను. ఆ పనిచేసే క్రమంలో అలిసిపోయి రిలాక్సేషన్ కోసం పేకాడుతాను. పేకాటలో ఓడిపోయి నపుడు గెలవడం కోసం కొంచెం మందు తీసుకుంటాను. ఆ కిక్కులో ఎవరిమీదయినాసరే చెయ్యేస్తాను. అదంతా నా యిష్టం నీకు ప్రశ్నించే హక్కులేదు. నేను మగాడ్ని. నీకు లేని అవయవమొకటి నాకు అదనంగా వుంది. అహ్హాహ్హా... అంటూ కాలరెగరేస్తాడు స్టయిలుగా.

ఈ మాటలన్నీ ఒక్కొక్కసారి అతడు నేరుగానూ, మరి కొన్నిసార్లు పరోక్షంగానూ వసంతలక్ష్మికి అవగాహనకొచ్చేలా చేస్తాడు. ఇలాంటి సంఘటనలు ఎన్నెన్నో జరిగిపోయాక

'ఇంత ఆలస్యంగా వస్తున్నారేమిటి?' అని అడిగే హక్కు తనకి లేదని తెలుసుకుందామె.

'బైట పని చేస్తున్నాను... బైట పని చేస్తున్నాను' అంటూ ఎప్పుడూ ఎందుకతడు బెదిరిస్తాడు? ఎందుకంటే ఆ శ్రమకి విలువుంది. డబ్బొస్తుంది. తను యింట్లో చేసే చాకిరి ఉత్పాదక శ్రమ కాదు కాబట్టి తను పనికిమాలింది. మొదట్లో అతడిలా బానిసను నిలబెట్టినట్లు నిలదీస్తుంటే, అభిమానం పొంగుకొచ్చేది. ఆవేశం విరుచుకొచ్చేది. అయితే వాటివల్ల ఎంత మాత్రం ఉపయోగంలేదని తెలుసుకుంది వసంతలక్ష్మి. అందుకని ఆ తర్వాత ఎప్పుడయినా అతడు కేకలేస్తూంటే...

'నేను సిగ్గులేనిదాన్ని... నేను అభిమానంలేనిదాన్ని... ఎన్ని మాటలయినా పడడానికే పుట్టాను...' అంటూ లోలోపలే జపం చేసుకుంటూ సహనాన్ని అరువు తెచ్చుకునేదామె.

ఆలోచనలు కలగాపులంగా ఆమె మెదడును తింటున్నాయి. ఎందుకో మాటిమాటికీ దుఃఖం తన్నుకొస్తోందామెకు. ఆ తెల్లవారుఝామున అలా కూర్చుని ఒంటరిగా భర్తకోసం ఎదురుచూస్తుంటే తన మీద తనకే జాలిగా వుందామెకి. తన మనసు విప్పి పరవడానికెవరూ లేరక్కడ... అన్న భావం మబ్బు మింగిన చంద్రుడిలా ఆమె గుండెను కమ్మేసింది.

వసంతలక్ష్మికీ మధ్యన సెల్ఫ్‌పిటీ ఎక్కువయిపోతోంది. ఆ సమయంలో ఆమె నెవర యినా పలకరిస్తే చాలు కళ్ళనీళ్ళు టపటపా పడిపోతాయి.

తన తోడికోడలూ బావగారూ, ఈ వయసులో అత్తగారూ మామగారూ జంటగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూంటారు. అటువంటి కుటుంబంలో పుట్టిన తన భర్త 'ఏముం టాయి నీతో మాట్లాడ్డానికి' అంటూ ఒక్క కసురు కసురుకుంటాడు. యింట్లో వుండమని తను కోరినపుడు...

తన జీవితంలో జీవితం, హృదయంలో హృదయం, మనసులో మనసూ అయిన జీవిత సహచరితో మట్లాడ్డానికి మాటలే వుండవా?... వుండవు... అదే పరాయివాళ్ళతో అయితే విసుగూ, విరామం లేకుండా నవ్వుతూ మాట్లాడుతాడు ముప్పయిరెండు పళ్ళూ కన్పించేలా...

మరో గత్యంతరంలేక, వేరే దారి కన్పించక ఉన్నాడో లేడో తెలీని దేవుడి కాళ్ళు పట్టుకుంది వసంతలక్ష్మి. చప్పున లేచి పూజగదిలోకి వెళ్ళి లైటు కూడా వేసుకోకుండా, ఆ గుడ్డి వెలుతురులోనే దేవుడి పటాల ముందు మోకాళ్ళ మీద కూర్చుని ప్రార్ధించింది.

'భగవాన్ అతడి నిర్లక్ష్యాన్ని భరించే శక్తిలేదు. నాకాయన కావాలి. కానీ యిలా కాదు. ఆయన్ని నాకనుకూలంగా మార్చు. నేను శత్రువుని కాను... తన స్నేహితురాలినని ఎరిగించు...' అంటూ ప్రార్ధిస్తుంటే వసంతలక్ష్మికి హఠాత్తుగా రెండురోజుల క్రితం భగవాన్ ప్రీచింగ్స్‌లో దాసాజీ చెప్పిన విషయం గుర్తొచ్చింది .

'మీరంతా మీ జీవిత భాగస్వాముల్నో లేక మీకు అనుకూలంగా లేని మరొకరినో మార్చడానికి ప్రయత్నిస్తుంటారు. వీలు కానప్పుడు భగవంతుని సాయం అర్ధిస్తుంటారు...

బహుశా అప్రయత్నం మీదనే మీరిక్కడకి వచ్చి వుండొచ్చు కూడా... అయితే మనుషుల్ని అమాంతంగా మార్చేయడానికి యిక్కడ మంత్రదండాలేమీ లేవు. మీకు అర్థం కావాల్సింది ఒకటే... మీరు ఎవరినో మార్చడానికి ప్రయత్నించే ముందు మార్పు అనేది మీ లోపలి నుండే ప్రారంభం కావాలన్నది గుర్తించరు... మొదట నిన్ను నువ్వు మార్చుకో..."

బయటెక్కడో కుక్కలు భయంకరంగా అరుస్తున్నాయి...

తన మంత్రందండం ప్రార్థన కుక్కల అరుపులతో కలిసి తనకే గందరగోళంగా అన్పించింది వసంతలక్ష్మికి. విసుగ్గానూ, టెన్షన్‌గానూ అన్పించింది. వెంటనే లేచి చప్పుడు చేయకుండా తన బెడ్ మీదికొచ్చి పడింది. అప్పటికి కోడి కూసింది గొంతెత్తి... తనని తాను మార్చుకోవడం గురించి కొంచెంసేపాలోచించింది వసంతలక్ష్మి.

ఉదయం లేచిందగ్గర్నుంచీ భర్తకి అన్నీ సమయానికి అమర్చిపెట్టడంలోనూ, అత్త మామల సేవలోనూ, తోడికోడలుతో పొరపొచ్చాల్లేకుండా సామరస్యంగా మెలగడంలోనూ, బాబిగాడి చదువు సంధ్యల విషయంలోనూ ఎందులోనూ ఏ లోటూ రాకుండా చూసుకోవడంతోనే రోజు పూర్తవుతుంది వసంతలక్ష్మికి.

తనని తాను ఏ యాంగిల్ నుంచి మార్చుకుంటూ రావాలో బోధపడలేదామెకి. అసహనాన్నీ, వస్తోన్న దుఃఖాన్నీ అణుచుకుంటూ మెల్లిగా లేచి వెళ్ళి కంప్యూటర్ ముందు కూర్చుంది.ఆ మధ్య బావగారు పిల్లలకి నేర్పుతూంటే తనూ సరదాగా బేసిక్స్ నేర్చుకుంది. కాసేపు కాలాన్ని చంపడం కోసం రెండు, మూడు గేమ్స్ ఆడింది. ఎంత ప్రయత్నించినా ప్రిన్స్ కోటలోపలికి చేరుకోలేకపోతున్నాడు. ఆడి ఆడి విసుగొచ్చి ఆగేమ్స్ అన్నీ చెరిపేసింది . ఆ తరువాత

W.W.W.angel free.. com/li3/telugiwrite

సైట్‌ని ఆన్ చేసింది తన భావాలు ఇంప్లిమెంట్ చేస్తూ... కొంచెంసేపు వసంతలక్ష్మి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. తన చుట్టూ ముసిరివున్న చీకట్లను పారద్రోలడానికి ఒకింత వేకువకోసం అర్థిస్తున్నదానిలా కంప్యూటర్ ముందు కూర్చుంది. కుర్చీలో ముందుకి వంగి ఆసక్తిగా.

వెంటనే స్క్రీన్ మీద....

'హాయ్ లక్ష్మీ ... హిహిహీ....

అనూహ్యరీతిలో అభివృద్ధి చెందిన కమ్యూనికేషన్ రంగం ప్రపంచాన్ని కుగ్రామంగా మార్చేసింది. సాంకేతిక రంగంలో అనేక మార్పులొచ్చి ప్రపంచ రహస్యాలన్నీ నట్టింట్లో తలలు విరబోసుకుంటున్నాయి. కొత్త మిలీనియంలోకి అడుగుపెట్టి వై 2 కె యిచ్చిన ఆనందంతో జగమంతా అభివృద్ధి దిశగా ప్రయాణిస్తోంటే నువ్వింకా ప్రబంధాల్లోని అభిసారికలా మొగుడి

కోసం ఎదురుచూస్తూ గడుపుతున్నావా?... వ్వెవ్వెవ్వె... హిహిహీ... రాబయటికి... ముందు నీ సర్టిఫికేట్ల పసుప్పచ్చ బూజు దులిపేయ్... మార్చుకో... నిన్ను నువ్వు మార్చుకో...' అని వచ్చింది.

బయట మోటార్‌సైకిలాగిన చప్పుడయింది .

అప్పటికి పూర్తిగా తెల్లవారిపోయింది .

చిత్రంగా నిన్న సాయంత్రం పడమరకి విసిరివేయబడ్డ సూర్యుడు మళ్లీ తూర్పు నుండి మొలకెత్తుతున్నాడు...

ఆదివారం ఆంధ్రజ్యోతి, 2000